01ATP02F_01ATP02F.qxd 02-05-2026 PM 11:27 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 03 మే 2026 పేజీలు : 04

ఏరో స్పేస్‌హబ్‌గా శ్రీ సత్యసాయి జిల్లా

- శ్రీసత్యసాయి జిల్లాలో రూ.15,000 కోట్లతో డీఆర్‌డీవో భారీ ప్రాజెక్ట్
- పుట్టపర్తిలోయుద్ధ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు
- ఈ నెల 15న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపనకు సన్నాహాలు
- సత్యసాయి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది.

అనంతపురం, మే 2, (ప్రభాతవార్త బ్యూరో)

దశాబ్దాల కాలం నుంచి కరువు కాటకాలతో వెనుకబడి నశ్రీ సత్య సాయి జిల్లా రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా వేగంగా మారేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా బెంగళూరుకు సమీపంగా ఉండటంతో జిల్లాకు ప్రాధాన్యత పెరిగి ఏరోస్పేస్, రక్షణ రంగం పరుగులు పెట్టనుంది అని పరిశీలకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీఆర్‌డీవో (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) ముందుకు వచ్చింది. ఈ నెల 15న సీఎం చంద్రబాబు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు రాకతో శ్రీసత్యసాయి జిల్లా దేశ రక్షణ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) మోడల్ యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. దేశీయంగా, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించే ఈ విమానాలను భారత వైమానిక దళం, నౌకాదళం కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సుఖోయ్ ఎస్‌యూ 30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 600 ఎకరాల భూమిని డీఆర్‌డీవోకు కేటాయించింది. భవిష్యత్ అవసరాల కోసం మరో 400 ఎకరాలను కూడా అందుబాటులో ఉంచింది. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి, 2029 నాటికి మొదటి నమూనాను సిద్ధం చేయాలని, 2035 నాటికి పూర్తిస్థాయిలో విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏరోస్పేస్ హబ్‌గా శ్రీసత్యసాయి జిల్లా ఈ ఒక్క ప్రాజెక్టుతోనే కాకుండా శ్రీసత్యసాయి జిల్లా క్రమంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే పాలసముద్రం వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే మడకశిరలో



కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల వ్యయంతో వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్‌ను నిర్మించనుంది. ఇప్పుడు డీఆర్‌డీవో ప్రాజెక్టు కూడా తోడవడంతో జిల్లా పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసివస్తోంది. బెంగళూరు చుట్టుపక్కల రక్షణ రంగ విస్తరణకు అవకాశాలు తగ్గడంతో కంపెనీలన్నీ శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి. జిల్లాలోని పుట్టపర్తిలో విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాజెక్టులకు అదనపు బలంగా మారింది. ఈ పరిణామాలతో రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాంతానికి రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

రైతుల పొలాలకు విక్రయించడానికి ట్యాంకర్లతో తరలిస్తున్న యాడికి పంచాయతీ నీరు

ఊళ్లు.. అడుగుతున్నాయి నీళ్లు..!

యాడికి(తాడిపత్రి), మే2, ప్రభాతవార్త

వేసవి ఎండలు మండుతున్నాయి. గ్రామీణ ప్రజలు తాగు, సాగునీటికి అల్లాడిపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పల్లెల్లో రోజు రోజుకు నీటి సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఒకవైపు తాగునీరు కొన్ని పల్లెలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే..మరో వైపు బోరుబావులు ఎండిపోయి పండ్ల చెట్లను కాపాడుకోవడానికి కర్షకులు అష్టకష్టాలు పడుతున్నారు.

యాడికి మండలంలోని కోనుప్పలపాడు, కేశవరాయునిపేట, ఓబుళాపురం, చింతలాయపల్లి, బోయరెడ్డిపల్లి తదితర గ్రామాల రైతులు తమ దీర్ఘకాలిక పంటలను కాపాడుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా వ్యయప్రయాసలకోర్చి నీటిని తరలించుకుంటున్నారు. ఇక పిన్నేపల్లి, చింతలాయపల్లి, కమలపాడు, లక్షుంపల్లి, వీరన్నపల్లి తదితర గ్రామాల్లో ప్రతి రోజూ కాకపోయినా రోజు విడిచి రోజు తాగునీరు అందడం కూడా గగనమైపోయింది. అధికారులు చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతనే లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

సగటున ప్రతి ట్యాంకుకు రూ. 650 లు.. ప్రతి తడికి రూ. 6,500లు

యాడికి మండలంలో కోనుప్పలపాడు, ఓబుళాపురం, చెండ్రాయునిపల్లి, పిన్నేపల్లి, పుప్పాల, చింతలాయపల్లి, వెంగన్నపల్లి, లక్షుంపల్లి, కేశరాయునిపేట తదితర గ్రామాల్లో దీర్ఘకాలిక పండ్ల తోటలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. కోనుప్పలపాడులో ఒక్కో రైతు సగటున 300 చెట్లను సాగుచేస్తూ ఉన్నారు. అలా దాదాపు 100 మంది రైతులు నిమ్మసాగులో మునిగితేలుతున్నారు. ఇక్కడ దాదాపు 20 వేలకు పైగా నిమ్మచెట్లు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం నిమ్మ ధర ఆశాజనకంగా ఉండటంతో నిమ్మ పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. దాదాపు అందరి రైతుల పొలాల్లోని బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఒక్కో ట్యాంకరుకు దూరాన్ని బట్టి రూ.500 లు నుంచి రూ. 800 లు వరకు వెచ్చిస్తున్నారు. ప్రతి రైతుకు 200కు పైన 1,000కి లోపు నిమ్మ చెట్లు ఉన్నాయి. వీటిని కాపాడుకోవడానికి డ్రిప్పు పద్ధతిలో ప్రతి తడికి కనీసం పది ట్యాంకర్లు అవసరమవుతున్నాయని, ఆ లెక్కన సగటున ప్రతి తడికి రూ. 6,500 లు ఖర్చవుతోందని, అంత వెచ్చించినా నీరు దొరకడం

- అడుగంటిన జలం..చినుకురాలని దైన్యం
- తాగు, సాగునీటిపై ప్రభావం
- ట్యాంకుకు రూ.500-రూ.800 వరకు ఖర్చు
- ఆశ నిరాశల మధ్య అన్నదాత ఊగిసలాట

తరచుగా వీరన్నపల్లిలో తలెత్తుతున్న తాగునీటి సమస్యకు నిదర్శనం

కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఎక్కడ కొద్దిపాటి నీరున్నా.. ఎంత దూరమైనా వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళ్లి ట్యాంకర్లలో నీటిని తెచ్చుకొని పంటను కాపాడుకోవాల్సి వస్తోందని కర్షకులు మిగతా 4లో...

పెన్నహోబిళంలో నేత్రపర్వంగా హంస వాహనోత్సవం

-శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమిచ్చిన నృసింహస్వామి
-లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు

దేవేరులతో కలిసి హంస వాహనంపై విహరిస్తున్న నారసింహుడు

ఉరవకొండ, మే 2 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిళంలో గత నెల 28వ తేది నుండి జరుగుతున్న లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం బహుళ పాడ్యమి శనివారం శ్రీవారి హంస వాహనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సాయంత్రం మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ ఉభయ దాతలు వెంటరాగా కొండ క్రిందకు తీసుకువచ్చి శోభాయమానంగా తీర్చిదిద్దిన హంస వాహనంపై కొలువుదీర్చి ప్రధాన ఆలయం చుట్టూ ప్రదీక్షిణల ద్వారా ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉదయం లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ మొదలు మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు,



శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అర్చకులు ద్వారకనాధాచార్యులు, గుండుస్వామి, ఉత్సవ ఉభయ దారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరవకూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం... 2 >

ఎమ్మెల్యే అమిలినేనితో... గ్రామీణ రోడ్లకు మహర్దశ

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర బాబు

కంబదూరు, మే 2, ప్రభాతవార్త

రెండు దశాబ్దాలకు పైగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల కలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. కంబదూరు మండలం మంద, కుర్లపల్లి క్రాస్ నుంచి ఐపార్ల పల్లి వరకు చేపట్టిన రహదారి నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే సురేంద్ర బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నాణ్యత, వెడల్పు విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతు గతంలో కనీసం మట్టి రోడ్డు కూడా లేని పరిస్థితి ఉండగా, ఇప్పుడు పక్కా రహదారి నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరమని, అన్ని గ్రామాలకు రహదారులు పూర్తిగా అందించాలంటే కనీసం పదేళ్లు పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల కాలంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి మందగించిందని విమర్శించిన ఆయన, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మరిన్ని రహదారులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కళ్యాణదుర్గం ప్రాంతానికి ఎక్కువ రహదారులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ రహదారి సుమారు 8 కిలోమీటర్ల పొడవుతో, దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అధికారిక అనుమతులు పూర్తిగా రాకపోయినా, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన భం భం బాబా శిష్యుడు రామకృష్ణ స్వామి కుమారుడి వివాహంలో పాల్గొని పెళ్లి కుమారుడిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మూడు సెకన్లలో ఓటింగ్ వేయడం సాధ్యమేనా..?

- సుదీర్ఘంగా క్యూలో నిలబడి చివరగా ఓటేసిందెవరు..,?
- వారి వివరాలు తెలిస్తే పాదపూజ చేస్తా
- మిస్టరీగా మారిన ఏపీ ఎన్నికలు - డాక్టర్ పరకాల ప్రభాకర్.

సభలో మాట్లాడుతున్న రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్

అనంతపురం క్రైమ్ మే 2 ప్రభాతవార్త

గడిచిన సాధారణ ఎన్నికల్లో కేవలం మూడు సెకండ్ల వ్యవధిలో ఓటు వేయడం సాధ్యమేనా అని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ఆర్థికవేత్త డాక్టర్ పరకాల ప్రభాకర్ ప్రశ్నించారు. శనివారం ఆయన నగరంలోని జి ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి వికేంద్రీకరణ చర్చా వేదిక ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై జరిగిన చర్చావేదికలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ పురుషోత్తం రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్ రెడ్డి, సామాజిక ఆర్థిక విశ్లేషకులు రామచంద్రయ్య తదితరులు హాజరయ్యారు. సమావేశానికి జిల్లాలోని మానవతావాదులు, సంఘసంస్కర్తలు, పలువురు మేధావులు, న్యాయవాదులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ సాధారణ ఎన్నికలపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఆర్థికవేత్త, డాక్టర్ పరకాల ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం గడచిన అసెంబ్లీ ఎన్నికల వ్యవహారంలో ఇప్పటిదాకా క్లారిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఓటింగ్ శాతం పై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఈ అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయలేకపోవడం దురదృష్టకరమన్నారు. 2024లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు ఓ మిస్టరీగా మిగిలిపోవడం జరిగిందన్నారు. తాను లేవనెత్తిన అనుమానాలను ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదన్నారు. సుమారు 3,500 పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వేళ పెద్ద ఎత్తున ఓటింగ్ జరగడాన్ని గుర్తు చేశారు. అసలు 12 శాతం అదనంగా ఓట్లు ఎలా పోల్ అయ్యాయని ప్రశ్నించారు. మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో 100కు 132 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు.. ఇలాంటి ఎన్నో అనుమానాలను నివృత్తి చేయడం ఎన్నికల సంఘానికి బాధ్యత ఉందని ఆయన అన్నారు. అయితే ఎన్నికల సంఘం ఎందుకు భిన్నంగా వివరించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సాధారణంగా సాయంత్రం 6 గంటల లోగా పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉన్న ఓటర్లకే ఈ అవకాశం ఉంటుందన్నారు. అయితే పోలింగ్ తెల్లవారుజామున రెండు గంటల వరకు కొనసాగిందంటూ ఎన్నికల సంఘం చెప్పడం పలు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి అన్నారు. అయితే సాయంత్రం 6 గంటల నుండి తెల్లవారుజామున రెండు గంటల వరకు క్యూలో నించుని చివరగా ఓటు వేసింది ఎవరని ప్రశ్నించారు. అర్ధరాత్రి వేళలో 8 గంటల పాటు సుదీర్ఘంగా క్యూలో నిలబడి ఓటు వేసిన వారి వివరాలు తమకు అందిస్తే వారి పాద పూజ చేస్తానని చెప్పడంతో సమావేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ప్రెసైడింగ్ అధికారి డైరీ లేదు, టోకెన్లు లేవు, సీసీ కెమెరా ఫుటేజ్ లేదు, సుదీర్ఘ గంటల తరబడి వరుసలో వేచి ఉండి ఓటు వేసిన వారు ఎవరు..? వారి వివరాలు తెలపాలని కోరినా ఎలెక్షన్ కమిషన్ స్పందించక పోవడం విడ్డురంగా ఉందన్నారు. ఒక బూత్ లో రెండు గంటల 15 నిమిషాల వ్యవధిలో 491 ఓట్లు పోలేనట్లు ఎన్ని రకాల సంఘం తెలిపిందన్నారు. ఈ లెక్కన 135 నిమిషాలకు 491 ఓట్లు పోల్ కావడం జరిగింది అన్నారు. అయితే ఒక్కొక్క ఓటుకు 20 సెకన్లలో ఓటు వేయడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ 20 సెకండ్లలో ఏమి జరిగిందని ఆయన విశ్లేషించానన్నారు. ఒక ఓటరు పోలింగ్ బూత్ లోకి వెళ్ళిన తర్వాత ఏజెంట్లు, ఆ తర్వాత ఎన్నికల అధికారులు, వేలికి సిరా చుక్క వేయడం, మళ్లీ ఓటరు కంపార్ట్మెంట్ లోకి వెళ్లి ఒకటి అసెంబ్లీ, రెండోది పార్లమెంట్ ఇలా రెండు ఓట్లు వేయడం జరుగుతుందన్నారు. ఒక ఓటు వేసేందుకు ఎలక్ట్రానిక్ మిషన్లో ఏడు సెకండ్ల వ్యవధి పడుతుందన్నారు. ఇలా రెండు ఓట్లకు 14 సెకండ్ల వ్యవధి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక మిగిలింది కేవలం ఆరు సెకండ్లు మాత్రమేనన్నారు. ఇలా ఓటుకు కేవలం మూడు సెకండ్లలో ఎవరైనా ఓటు వేయొచ్చా..? ఇది ఎంతవరకు సమంజసం అని ఈ అంశాన్ని సభలో లేవనెత్తారు. దీంతో సభలో ఒక్కసారిగా చప్పట్లు మారుమోగాయి.

నేటి నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్ష
జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
హాజరుకానున్న 3,616 మంది అభ్యర్థులు
జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ మే 02 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ న్యూఢిల్లీ వారు నేడు అనగా 03వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ అండర్ గ్రాడ్యుయేషన్ పరీక్షలకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్షలను నిర్వహించడం జరుగుతోందని, జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలలో నిర్వహించబడుతుందని, అందులో అనంతపురములో 6, గుత్తిలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షకు 3,616 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షకు జిల్లా యంత్రాంగం తరుపున జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోలని నోడల్ ఆఫీసర్ గా నియమించడం జరిగిందని తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశించిన సమయంలోపు హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మధ్యాహ్నం 01:30 గంటలలోపు చేరుకోవాలని, అనంతరం పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు ఈఅడ్మిట్ కార్డ్ తో పాటు ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏదో ఒక గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు అవ్వాలన్నారు. ఈ పరీక్షకి మొబైల్ ఫోన్లు గాడ్జెట్లు/బ్లూ టూత్/ఏదైనా ఇతర కమ్యూనికేషన్ పరికరాలు పరీక్ష కేంద్రములోనికి అనుమతించబడవని ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఈ పరీక్షను విజయవంతం చేయాలని, నిజాయితీగా నిర్వహించాలని అన్ని రకాల చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

గ్రామాల్లో తాగునీరు,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం - ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాదర్బార్‌లో ప్రజల ద్వారా ఆర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, మే 2 ప్రభాతవార్త

మండలంలలో ప్రజా సమస్యల పరిష్కారానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలని,వేసవి కాలం కావడంతో గ్రామాల్లో తాగునీరు సమస్యలు లేకుండా చూడాలని అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సచివాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీతకు మండల తెదేపా నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వివిధ గ్రామాలు నుంచి వచ్చిన ప్రజలతో వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆర్జీలను ఎమ్మెల్యే తీసుకున్నారు. పలు సమస్యలు తక్షణమే అధికారుల సమక్షంలోనే పరిష్కారం చేయడం జరిగింది. పి. యాలేరు గ్రామానికి చెందిన జయశీల పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో 88 ఆర్జీలు ప్రజలు ఇవ్వాగా,అందులో ఎక్కువగా 39 ఆర్జీలు రెవెన్యూ,38 పంచాయితీ రాజ్ విభాగాలకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. ఆయా శాఖల ఆధికారులకు త్వరగతిన ప్రజల ఆర్జీల సమస్యలకు పరిష్కారం చూపాలని,భూ సమస్యలు ఇరువర్గాల వారితో మాట్లాడి రాజీ మార్గంలో పరిష్కారం చూపే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని అభివృద్ధి పనులు,సంక్షేమ కార్యక్రమాలు అందించినా,ప్రజల వ్యక్తగత సమస్యలు పరిష్కరించకపోతే వారిలో ప్రభుత్వం,నాయకులు పని చేయలేదన్న భావన ఉంటుందన్నారు. కావున ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రధాన్యత ఇవ్వాలని అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతరం సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో పాడి రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలలో ఒక్కటైన పాలధార కార్యక్రమంలో భాగంగా కొంతమంది పాడి రైతులకు పశువుల దాణాను ఎమ్మెల్యే అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 2.95 లక్షల రూపాయల విలువైన చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మినాయక్,ఎంపిడిఓ లక్ష్మి నరసింహ,హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, మండల కన్వీనర్ శ్రీనివాసులు,పి.యాలేరు సొసైటీ అధ్యక్షుడు కృష్ణమోహన్ చౌదరి,వాల్మీకి సాధికారిక కమిటీ అధ్యక్షుడు కందుల ఓబుళపతి, మండల తెదేపా నాయకులు మండల అక్కులన్న,రామదాసు, అద్దెప్ప, బాబా,పూల ఓబులపతి,కొండన్న,మండల ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి, ఏకాంత్,యం,ఆనంద్,పాపంపల్లి శ్రీనివాసరెడ్డి, పి.యాలేరు జయశీల, పెద్దలక్ష్మక్క,,హైస్కూల్ విద్యా కమిటీ అధ్యక్షుడు మందల బొమ్మయ్య, ఆర్‌డబ్లూయస్ ఏఈ శివకుమార్,వ్యవసాయాధికారి జ్యోతి విజయ్‌కుమార్, మండల తెదేపా నాయకులు,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత చెరువు గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుల అరెస్ట్

హత్య కేసు వివరాలను వెల్లడించిన కళ్యాణదుర్గం రూరల్ సిఐ గణేష్

కళ్యాణదుర్గం రూరల్ మే 2 ప్రభాతవార్త

హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సిఐ గణేష్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్య కేసులో కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని గోళ్ళ గ్రామపంచాయతీ మజారా గ్రామం పాత చెరువులో మార్చి నెలాఖరులో జరిగిన హనుమంతు హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు సిఐ గణేష్ నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు ఆయన వివరాల మేరకు పాత చెరువు గ్రామానికి చెందిన మృతుడు హనుమంతు హత్య కేసులో ప్రధాన నిందితురాలైన అతని భార్య సుకన్యతో పాటు మైనర్ కూతురు అయిన అమృతను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. భార్య సుకన్యకు వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కారణంతోనే హత్యకు పాల్పడినట్లు తెలిపారు ఇంటిలోనే హత్య చేసి ఇంటి ఆవరణలోనే పూడ్చి పెట్టి నట్లు తెలిపారు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఫోరెన్సిక్ ల్యాబ్ నకు పరీక్షల కోసం పంపినట్లు పరీక్షలలో తన రక్తసంబదీకుల డిఎన్ఏ తో సరిపోలడంతో మృతుడు హనుమంతు నని నిర్ధారించినట్లు ఆయన తెలిపారు ఈ కేసులో నిందితులైన సుకన్య ఆమె కూతురు అమృతను మల్లాపురం క్రాస్ రోడ్డులో శనివారం అరెస్ట్ చేసినట్లు కోర్టు ముందు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

మృతుడు నగేష్‌కు నివాళి అర్పించిన పాలబండ్ల శ్రీరాములు

బ్రహ్మసముద్రం, మే 2 ప్రభాతవార్త

నివాళులర్పిస్తున్న దృశ్యం

మండలంలోని బొమ్మగాని పల్లిగ్రామానికిచెందిన నగేష్ అనారోగ్యంతోమృతి అకాల మరణం చెందడం పట్ల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు శనివారం బొమ్మగాని పల్లి గ్రామానికి చేరుకుని మృతి చెందిన నగేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు అనంతరం శోకసముద్రంలో ఉన్నవారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే తరపున ధైర్యం చెప్పారు కుటుంబానికి వచ్చిన ఈ కష్టం కలచివేసింది. కార్యకర్తల క్షేమమే ఎమ్మెల్యే ప్రథమ ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పార్టీ శ్రేణులు నగేష్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని శ్రీరాములు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాము, శ్రీనివాసులు,స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొని మృతుని అంతిమ నివాళులు అర్పించారు.

ఉరవకొండలో మొదలైన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం

-వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ

బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న పిల్లలు

ఉరవకొండ, మే 2 ప్రభాతవార్త

పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. సాప్ ఆధ్వర్యంలో, డీఎస్ఏ పర్యవేక్షణలో 30 రోజులపాటు జరిగే ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో 8 నుంచి 16 సంవత్సరాల మధ్య వయసుగల బాల బాలికలకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లుశిక్షణ ఇస్తున్నారు. ఈసందర్భంగా కోచ్‌లు మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసుకున్న బాలబాలికలకు సర్టిఫికేట్లు అందించడం జరుగుతోందన్నారు. శిక్షణ ద్వారా పిల్లల్లో శారీరక దృఢత్వంతోపాటు, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మానసిక ఒత్తిడి తగ్గి, ఏదైనా సాధించగలమ్మ ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన బాల బాలికలు రాబోవు రోజుల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు కూడా లభిస్తాయన్నారు.

మనం దినపత్రిక జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

శెట్టూరు, మే 02 ప్రభాతవార్త

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జర్నలిస్ట్ లక్ష్మీ నారాయణపై దాడి చేసిన గీతం కాలేజీ యాజమాన్యంపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు టైగర్ వన్నూరుస్వామి డిమాండ్ చేశారు. నేటి సమాజంలో ఎన్నడు లేని విధంగా జర్నలిస్టుల పైన, పత్రిక విలేకరుల పైన దాడులు దౌర్జన్యాలు హత్యలు జరుగుతూనే ఉన్నాయి, నిత్యం సమాజంలో అవినీతి, అక్రమాలు వెలుగుతీస్తూ,నిజ నిజాలు నిర్భయంగా రాస్తూఅసమానతలను వెలుగులోకి తీస్తూ సమాజ హితం కోసం పనిచేస్తున్న విలేకరులకు, రక్షణ కల్పించడంలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు, గీతం కాలేజీలో అవినీతి అక్రమాలు, నిజాలు నిర్భయంగా రాస్తున్నందుకే, గీతం కాలేజీ యాజమాన్యం వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ సభ్య సమాజం తలదించుకునే విధంగా ఇంటికి వెళ్లి జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ పైన, భార్య పిల్లల పైన దాడి చేసి,కొట్టి భయభ్రాంతులకు గురిచేసి, అవమానించడం చాలా దారుణమైన దుర్మార్గమైన చర్య అని, ఎమ్మార్పీఎస్ అనంతపురం శ్రీ సత్యసాయి ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైగర్ వన్నూరుస్వామి మాదిగ తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసుల అధికారులు వెంటనే గీతం కాలేజీ యాజమాన్యం పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడమైనది. కార్యక్రమంలో సత్య సాయి జిల్లా అధ్యక్షులు గంగాద్రి మాదిగ,మరియు ఎమ్మార్పీఎస్ మడకశిర నియోజకవర్గం అధ్యక్షులు టి చందు మాదిగ, హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు శంకర్ మాదిగ, రామాంజనేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం మంత్రి సవిత..

పెనుకొండ మే 2 ప్రభాతవార్త

హెచ్‌డిఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబిత

రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం మంత్రి సవిత హెచ్‌డిఎస్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రగతిని సమీక్షించారు. హాస్పిటల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సి ఎస్ ఆర్ నిధుల ద్వారా రూ.2 కోట్ల వ్యయంతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా, తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల ద్వారా హాస్పిటల్ నిర్మాణం మరియు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంకా రూ.50 లక్షల నిధులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, హాస్పిటల్‌ను 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే,ఈఎస్ఐ హాస్పిటల్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు ఇప్పటికే పంపినట్లు చెప్పారు.ఈ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

హిందూపురం మే 2 ప్రభాతవార్త

స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆజాద్ నగర్ లో శుక్రవారం అర్ధరాత్రి గ్యాంబ్లింగ్ ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని నెలలుగా నివాసిత ప్రాంతంలో విచ్చలవిడిగా గ్యాంబ్లింగ్ జరుగుతుండడంతో విసిగెత్తిన స్థానిక ప్రజలు 100 కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ సీఐ జనార్ధన్, ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం పేకాట శిబిరంపై దాడి చేసింది. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో ఆజాద్ నగర్ కు చెందిన చాంద్, జి షాన్, అహ్మద్, జబీ తదితర ఆరుగురు ఉన్నట్లు కరీం వెల్లడి. వీరి నుంచి రూ. 11,000, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ కరీం వెల్లడించారు.

సోమిరెడ్డిపల్లిలో జనగణన ప్రక్రియను పరిశీలించిన నోడల్ అధికారి

సోమిరెడ్డిపల్లిలో జనగణన ప్రక్రియను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

లేపాక్షి, మే 2 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లిలో జరుగుతున్న జనగణన ప్రక్రియను శనివారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశ భవిష్యత్తు ప్రణాళికల్లో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని, ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామ మ్యాపుల తయారీ, ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. గణన సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సూర్యవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిర్దేశించిన నిబంధనల ప్రకారం గణన పకడ్బందీగా జరగాలన్నారు. గణనలో ఏ ఒక్క ఇల్లు లేదా వ్యక్తి వివరాలు విస్మరించకూడదని, గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాంకేతిక అంశాలపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, మండల రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, విఆర్ఓలు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో డేటా సర్వే నిర్వహించాలి

-కమిషనర్ జబ్బార్‌మియా

సర్వే సామాగ్రిని పంపిణీ చేసిన దృశ్యం

గుత్తి, మే 2 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనగణన కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు అంకితభావంతో డేటా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం సిబ్బందికి సంబంధిత మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా డేటాను ప్రజల నుండి సేకరించి మున్సిపాలిటీ ప్రగతి మెరుగు స్థాయిలో ఉంచే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఛార్జ్ ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకా గౌరమ్మ మృతికి సంతాపం - సిపిఐ నేతల నివాళి

కళ్యాణదుర్గం, మే 2 ప్రభాతవార్త

సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎండి సంజీవప్ప

సిపిఐ జాతీయకార్యదర్శి కె. రామకృష్ణ మాతృమూర్తి శ్రీమతి కాకా గౌరమ్మ మృతి పట్ల పలువురు సిపిఐనాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు న్యాయవాది ఎండిసంజీవప్ప మాట్లాడుతూ ఆమె ఆదోనిలోని ఒ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారని, వంద సంవత్సరాలు వయసున్న శ్రీమతిగౌరమ్మ తన కుటుంబాన్ని విలువలతో పెంచుతూ, పిల్లలను మంచి మార్గంలో నడిపించడంలో తల్లిగా విశేష పాత్ర పోషించారన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు భావజాలంతో ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న తన కుమారులకు ఆమె ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా శ్రమజీవుల హక్కుల కోసం పనిచేసే మార్గాన్ని ఆమె గౌరవించడమే కాకుండా, ఆ దిశగా తన సంతానం ముందుకు సాగేందుకు ప్రోత్సాహం అందించారని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శిగా కె. రామకృష్ణ ఎదుగుదలలో ఆమె ప్రోత్సాహం, విలువలు ఎంతో దోహదపడ్డాయని కొనియాడారు. శ్రీమతి గౌరమ్మ కుటుంబానికి అందించిన సేవలు మరువలేనివని పేర్కొంటూ, ఆమె మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, రామకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రాగుల కొనుగోలుకు సిద్ధం జె సి మోర్య భరద్వాజ్

జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్

పుట్టపర్తి(కలెక్టరేట్), మే 02, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లాలో రబీ 2025 26 సీజన్‌కు సంబంధించి రైతుల నుండి కనీస మద్దతు ధరకు రాగుల కొనుగోలు ప్రారంభమైనట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ ఒ ప్రకటనలో తెలిపారు. క్వింటాలుకు రూ. 4,297/గా ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించిందన్నారు. ఈక్రాప్ లో రాగి పంట నమోదు చేసుకున్న రైతులు తమ పంటను అమ్ముకోవచ్చన్నారు. రైతులు తమ వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలనీ, కొనుగోలుకు అవసరమైన గొనె సంచులు, రవాణా ఖర్చులు, హమాలీ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని జె.సి కోరారు.

ట్రై సైకిల్ అందజేత


ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం మే 2 ప్రభాతవార్త

పట్టణంలోని 9 వ వార్డ్ పులమితి రోడ్ ప్రాంతంలో నివసిస్తున్న మంజునాథ్ అనే వికలాంగుడికి మూడు చక్రాల సైకిల్ ను ఎమ్మెల్యే బాలకృష్ణ క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి దుర్గా నవీన్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి దుర్గా నాని మొదలగు వారు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

హిందూపురం టౌన్ మే 2 ప్రభాతవార్త

పట్టణంలోని బెంగళూరు రోడ్‌లో ఉన్న శ్రీ రేణుక యల్లమ్మ దేవాలయం 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఆలయంలో రుద్రాభిషేకం, నవగ్రహ హోమాలు, శాంతి హోమం పూర్ణాహుతి, మహా మంగళహారతి మొదలగు కైంకర్యాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు హనుమంతరాయప్ప, సతీష్ స్వామి ఆధ్వర్యంలో సాయంకాలం అమ్మ వారు పట్టణ ప్రధాన రహదారిలో పూల పల్లకి పై జగన్మాత విహరించారు. కర్ణాటకలోని హుబ్లీ సమీపంలో ఉన్న రేణుక యల్లమ్మ ప్రధాన పుణ్యక్షేత్రం సౌదత్తి నుంచి భక్తులు, స్థానికంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కళాకారుల కోలాటం

అంబెడ్కర్ విగ్రహానికి విరాళం అందజేసిన ఎమ్మెల్యే

కంబదూరు, మే 2, ప్రభాత వార్త : మండలంలోని మేళ్ల కుంట గ్రామంలో ఏర్పాటు చేయబోతున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామస్థుల విన్నపం మేరకు ఆయన ఈ విరాళాన్ని తన స్వంత నిధుల నుండి అందజేయడం విశేషం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబెడ్కర్ దేశానికి చేసిన సేవలు అమూల్యమని, ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గ్రామాల్లో అంబెడ్కర్ విగ్రహాల ఏర్పాటు ద్వారా యువతలో సామాజిక చైతన్యం పెంపొందుతుందని తెలిపారు.గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విగ్రహాన్ని త్వరలోనే ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర బాబు

కూడేరు మండలం అరవకూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొనడంతో ఇద్దర యువకుల సజీవదహనం

ఆటోను సైతం ఢీకొన్న బొలేరో మరో ముగ్గురుకి గాయాలు

ఉరవకొండ , మే 02 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో సజీవదహనమైన యువకులు

ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని కూడేరు మండలం అరవకూరు గ్రామం వద్ద అనంతపురం-బళ్ళారి 42వ నంబర్ జాతీయ రహదారిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలం పందికుంట గ్రామానిక చెందిన ఆకాశ్(20), అజిత్ (19) అనే యువకులు సజీవ దహనమయ్యారు. అందరినీ కలచివేసిన ఈ ఉదారక ఘటన వివరాల్లోకి వెలితే.. వజ్రకరూరు మండలం పందికుంటకు చెందని యువకులు ఆకాష్ ,అజిత్ అనంతపురంలో జరిగిన ఒక వివాహకార్యక్రమానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలోనే అరవకూరు గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన బొలేరో వాహనం వెనుక వైపు నుండి బలంగా ఢీకొని కొద్ది దూరం లాక్కెల్లడంతో పెట్రోల్ ట్యాంకుకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికే తీవ్ర గాయాల పాలైన ఇద్దరు యువకులు తప్పించుకొనే మార్గంలేక అమంటల్లోనే చిక్కుకొని సజీవ దహనమయ్యారు. మంటల్లో చిక్కుకున్న యువకులను కాపాడటానికి స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కాగా బొలేరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొని ముందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోనుకూడా ఢీకొనడం విశేషం. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌తో పాటు అందులో ప్రయానిస్తున్న మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. కాగా ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనం కూడేరు ప్రాంతానికి చెందినదేనని స్థానికులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే కూడేరు పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఉరవకొండలో తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ విస్తృత తనిఖీలు

-తక్కువ తూకాలతో చిరు వ్యాపారుల కొందరి మోసం బట్టబయలు

-సీల్లు లేని తూకం యంత్రాలు, రాళ్లు సీజ్‌చేసి హెచ్చరికలు జారీ

ఉరవకొండ, మే 2 ప్రభాతవార్త

తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్

ఉరవకొండ పట్టణంలో శనివారం సాయంత్రం తూనికలు, కొలతలశాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు అనేక మంది తక్కువ తూకాలు, కొలతలతో మోసం చేస్తున్నారని ఇటీవలి కాలంలో వినియోగదారుల నుండి పిర్యాదు అధికంగా కావడంతో ఆయన ఈ తనిఖీలు చేపట్టారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్ ఆవరణం లోని పండ్లు, కూరగాయలు, పూల వ్యాపారుల తూనికల యంత్రాలను పరిశీలించి తూకాలు తనిఖీ చేయగా కేజీకు 1,000 గ్రాములకు బదులు అనేక మంది వ్యాపారులు 800, 900 గ్రాములు మాత్రమే వినియోగదారులకు అందించి మోసం చేస్తూ లబ్ధిపొందుతున్నారని బట్టబయలైంది. దీంతో సీల్లు లేని తూకం యంత్రాలు, రాళ్లను సీజ్ చేసి హెచ్చరికలు జారీ చేశారు. చేతితో పట్టుకొని తూకంవేసే త్రాసులను వినియోగించరాదని సీల్లు వేసిన ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. మరొక మారు తూకాలు, కొలతల్లో మోసాలు బయటపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకొని అపరాధ రుసుం వసూళు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తూనికలుకొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ విలేఖరులతో మాట్లాడుతూ మార్కెట్లలో ధర్మకాట ఏర్పాటు చేసి వినియోగదారులు మోసపోకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు. జరిమానాలు విధిస్తే చిరు వ్యాపారులు ఒక్కసారిగా చెల్లించలేరని ప్రస్తుతానికి హెచ్చరికలు చేయడం జరిగిందన్నారు.

స్వాధీనం చేసుకున్న తూనికల యంత్రాలు

అనాథ వ్యక్తికి ఆర్థిక సహాయం

వెంకటేశ్వర ప్రసాద్‌కు తోడ్పాటు అందించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్

కంబదూరు, మే 2 , ప్రభాతవార్త

వెంకటేశ్వర ప్రసాద్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న బద్దే నాయక్

వార్త ప్రభావం

ఓ కాలమా ఈ కర్మేంటీ" అనే శీర్షికతో ఏప్రిల్ 30న ఒక తెలుగు జాతీయ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కంబదూరులో అనాథగా జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర ప్రసాద్‌ను స్వయంగా కలిసి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఇతరంగా ఐదు జతల బట్టలు, నాలుగు జతల పంచెలు, పాదరక్షలు, లగేజీ బ్యాగ్, హ్యాండ్ స్టిక్ వంటి అవసరమైన సామగ్రిని కూడా అందించారు.ఈ సందర్భంగా బద్దే నాయక్ మాట్లాడుతూ, ఒక ఉపాధ్యాయుడి కుమారుడు ఇలాంటి పరిస్థితుల్లో అనాథగా మారడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ట్రస్ట్ తరఫున అవసరమైన సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.బద్దే నాయక్ చేసిన సహాయానికి స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపించారు. వెంకటేశ్వర ప్రసాద్ కూడా బద్దే నాయక్‌ను కలుసుకుని,"సార్, మీ గురించి నేను విన్నాను" అని చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పొలిట్ బ్యూరో సభ్యుడుగా ఎన్నికైన ఎమ్మెల్యే కాలువకు సన్మానం

కనేకల్లు మే 0 2 ప్రభాతవార్త

ఎమ్మెల్యేని సన్మానిస్తున్న కురుబ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె

22 ఏళ్లుగా పొలిట్ బ్యూరో సభ్యులు గా పనిచేస్తున్న అదే పదవి మళ్ళీ ఇవ్వడంతో ప్రభుత్వ విప్, పొలిట్ బ్యూరో సభ్యులు. రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులుకి ఆంధ్రప్రదేశ్ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెదేపా నాయకులతో కలిసి శనివారం బొకే ఇచ్చి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే మల్లికార్జున మాట్లాడుతూ రాయదుర్గ శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో అతి కీలకమైన వ్యక్తిగా ఉండడం అలాంటి వ్యక్తి మనకి ఎమ్మెల్యేగా రావడం మన రాయదుర్గం నియోజకవర్గం గర్వకారణము అన్నారు. ఎంతోనమ్మకంగా పార్టీలోపనిచేసి ఎన్నో పదవులను అధిగమించిన కాల్వ శ్రీనివాసులు రాయదుర్గ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కనేకల్ రూరల్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ వాల్మీకి నాగార్జున సిద్దారెడ్డి, తెలుగు యువత అధికార ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి..

అనంతపురం కల్చరల్, మే 0 2 ప్రభాతవార్త

ఆర్ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైన సంఘటన సత్య సాయి జిల్లా ఓబుల దేవర చెరువు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలకు వెళ్తే ఓబుల దేవర చెరువు మండల కేంద్రంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు ఆమడగూరు మండలం తనకంటి వారి పల్లికి చెందిన చంద్రశేఖర్ (40) వడదెబ్బ తగిలి ఆసుపత్రికి వస్తే ఆర్ఎంపీ డాక్టర్ సెలైన్ బాటిల్ ఇచ్చి ఇంజక్షన్ ఇచ్చిన గంట తర్వాత రోగి మృతి చెందాడు. ఈ విషయం బయటికి పోకుండా బాధితుల కుటుంబ సభ్యులకు రెండు లక్షలు ఇచ్చి రాజి కుదుర్చుకున్నట్లు సమాచారం. బాధితులు ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయలేదు.ఈ విషయం శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో హల్చల్ జరుగుతుంది. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయని పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

03ATP02_03ATP02.qxd 02-05-2026 PM 11:30 Page 1

కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాల విద్యార్థులు రాణిస్తున్నారు

- విద్యార్థినులను సత్కరించి.. నగదు బహుమతి అందజేసిన ఎమ్మెల్యే సునీత - పండమేటి వెంకటరమణ స్వామి ఆలయానికి రూ.౩౦లక్షలు విరాళం

పండమేటి వెంకటరమణ స్వామి ఆలయానికి రూ.30లక్షలు అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థినులను సత్కరించి.. నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, మే 2 ప్రభాతవార్త

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు రాణిస్తున్నారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట సమీపంలోని ఎం.జె.పి బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇందులో టాప్4 విద్యార్థినులను ఆమె ఘనంగా సత్కరించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో విద్యార్థినులకు శాలువాలతో సన్మానించి, నగదు బహుమతిని అందించారు. ఉపాధ్యాయులను, విద్యార్థినుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించి, మొమెంటోలు అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో కనగానపల్లికి చెందిన గరుగు అక్షయ 581మార్కులు, మన్నీల గ్రామానికి చెందిన షహీదా 565మార్కులు, బెలుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన గ్రీష్మ 581మార్కులు, కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన జాహ్నవి 577మార్కులు సాధించారు. ప్రతి ఏటా నసనకోట ఎంజేపి విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరుస్తున్నార్నన్నారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ పండమేటి వెంకటరమణ స్వామి దేవాలయానికి దాతల ద్వారా సేకరించిన రూ.30లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు దాతల ద్వారా 30లక్షల రూపాయల విరాళాలను సేకరించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో దేవస్థానం కమిటీ సభ్యులకు ఈ విరాళాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవాదాయశాఖ ద్వారా కూడా నిధులు తీసుకొస్తున్నట్టు చెప్పారు. పండమేరు చుట్టూ పార్కును కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేసినట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు.

కమిషనర్‌ను విమర్శించడానికి ఖండిస్తున్నాం

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

భవనారి వెంకటేశ్‌బాబు

వాణిజ్య పన్నుల శాఖలో గత ఏడాది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నుంచి జాయింట్ కమిషనర్ వరకు బదిలీలు అత్యంత పారదర్శకంగా, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పూర్తిగా పనితీరు ఆధారంగా చేపట్టారని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, సిఫార్సులు లేకుండా జరిగిన ఈ బదిలీలు కొందరి ఆదాయ మార్గాలకు, పైరవీలకు చెక్ పెట్టాయని, ఇది జీర్ణించుకోలేని కొందరు నిజాయితీ గల చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబుని విమర్శించడాన్ని మా సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేశ్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్కూల్ బస్సుల తనిఖీ

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, జిల్లాలో గల అన్ని స్కూలు బస్సులను శనివారం తనిఖీ చేశారు. మోటార్ వాహన చట్టం 1989 లోని సెక్షన్ 185 ప్రకారం, ఎఐఎస్ 63 ప్రకారం బడి బస్సులలో ఉండవలసిన ఎమర్జెన్సీ ద్వారాలు, అగ్ని మాపక పరికరాలు, వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైస్లు, పానిక్ బటన్లు, సీట్లు సంఖ్య, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, కిటికీల దగ్గర ఉండవలసి రైలింగ్స్ మొదలగునవి సరిగా ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయడం జరుగుతుంది. భద్రతా ప్రమాణాలు సరిగా లేని బస్సు యజమానులకు లేదా స్కూల్ యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి వారం రోజుల లోపు రెక్టిపై చేయాలని తెలియజేశారు. జిల్లాలో 680 బడి బస్సులు ఉన్నట్టు జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు తెలియజేశారు.

గ్రంథాలయానికి రండి విజ్ఞానవంతులు కండి

గ్రంథాలయంలో విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు జిల్లా గ్రంథాల సంస్థ అధ్యక్షులు వడ్డే వెంకట్, కార్యదర్శి పి.కమ్మన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీరాములు ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు అంకె రామలింగయ్య, తెలుగు లిటరేచర్ యోగా మాస్టర్ వెంకటేశప్ప, డ్రాయింగ్ మాస్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ యొక్క వేసవి శిక్షణ తరగతులకు నిర్వహించడానికి ముందుకొచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి కమ్మన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ సమ్మర్ క్యాంప్ ప్రోగ్రామ్ని సద్వినియోగం చేసుకొని సెల్ఫోన్లకి దూరంగా ఉండడానికి ఇది ఒక మంచి కార్యక్రమం అని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గ్రంథాలయధికారి గోవిందు, సిబ్బంది, ఉజ్జనేశ్వరి, నాగరాజు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రోత్సాహం అభినందనీయం

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

నల్లపల్లి విజయ్ భాస్కర్

అర్బన్ ఎమ్మెల్యే శ్రీ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ ప్రశంసించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 580 మార్కులు, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,000 నగదు బహుమతితో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందించడం ద్వారా విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి, ఉత్సాహాన్ని పెంపొందించే గొప్ప ప్రయత్నం చేసి ఇతర ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత విస్తరించి, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి గౌరవ మానవ వనరుల శాఖ మంత్రి వర్యులు శ్రీ నారా లోకేష్ గారు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల విజయాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని కొనియాడారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

కేజీబీవీ విద్యార్థినీలకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యాలు

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

పదవ తరగతి ఫలితాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ కేజీబీవీలలో మొదటి స్థానంలో 590/600 మార్కులు సాధించిన పెద్దవడగూరు కేజీబీవీ విద్యార్థిని కే.జయశ్రీ, ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి స్టేట్ కేజీబీవీలలో బై.పి.సి గ్రూప్ లోమూడవ స్థానంలో 981/1000 మార్కులు సాధించిన కూడేరు కేజీబీవీ విద్యార్థిని కే కీర్తనలను శనివారము అభినందించిన సమగ్రశిక్ష ఏపీసి టీ శైలజ, జిసిడిఓ కే.కవిత, సిబ్బంది. ఇదే స్ఫూర్తితోనే పనిచేయాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ఆహ్వానం

సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

అనంతపురం వైద్యం మే 2 ప్రభాతవార్త

ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 550 పైగా మార్కులు సాధించిన బలిజ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య ఆధ్వర్యంలోని కమిటీ నిర్ణయించిందని వారు పేర్కొన్నారు శనివారం అనంతపురం నగరంలోని బాలాజీ ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో అనంతపురం ఉమ్మడి జిల్లాకు చెందిన బలిజ విద్యార్థినీ విద్యార్థులు 550 మార్కులు సాధించినవారు ఈ ప్రతిభా పురస్కారాలకు అర్హులని కావున అర్హత కలిగిన విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ టి సి లేదా క్యాస్ట్ సర్టిఫికెట్ ఆధార్ కార్డ్ రెండు పాస్పోర్ట్ ఫోటోలతో అనంతపురం నగరంలోని బలిజ సంఘం కార్యాలయం లో నేరుగా కానీ పోస్టు ద్వారా కానీ ఈనెల 22వ తేదీలోగా పంపాలని కోరారు అర్హత ఉన్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు నగరంలోని బాలాజీ కళ్యాణ మండపంలో పురస్కారాన్ని అందజేస్తామని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9866419693 9247792567,9490180177, 9550616003, 9440044700 నంబర్లను సంప్రదించాలని సూచించారు

యస్వీ కళాశాలలో హీమోగ్లోబిన్ పరీక్షా

హీమోగ్లోబిన్ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి అధ్యక్షతన బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు హీమోగ్లోబిన్ పరీక్షా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఏ.వి. ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ.. హీమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల కలిగే సమస్యలు, సరైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిరక్షణపై వివరణ ఇచ్చారు. అనంతరం ఏ.ఓ.ఏ. శ్రీనాథ్ విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణలో హీమోగ్లోబిన్ పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు 300 మంది పాల్గొని తమ హీమోగ్లోబిన్ స్థాయిలను పరీక్షించుకున్నారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగం ఎచ్.ఓ.డి.యస్.రిజ్వానా బేగం, అధ్యాపకులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి డిఆర్‌పిల శిక్షణా కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, మే 2 ప్రభాతవార్త

గత 6 రోజులుగా వివేకానంద జూనియర్ కళాశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి డిఆర్‌పి శిక్షణా కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. ముగింపు సమావేశంకు ముఖ్య అతిథిలుగా సమగ్ర శిక్ష ఎపిసి టి శైలజ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పిడి శశికళ విచ్చేసారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. పిల్లల సమగ్ర అభ్యసనకు ప్రీ ప్రైమరీ స్థాయి చాలా ముఖ్యమైనదని అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ స్థాయి పిల్లలకు బోధించే టీచర్లు కూడా అత్యంత సమర్థవంతంగా ఉండవలసిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం వారికోసం అత్యద్భుతమైనటువంటి శిక్షణను ఏర్పాటు చేసిందని అలాంటి టీచర్లకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన డిఆర్‌పిలు అందరూ సమర్థవంతంగా శిక్షణ పొందారని తెలియచేశారు. కార్పొరేట్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్థాయిలో బోధించేటువంటి బోధనా పద్ధతులు ఇప్పుడు అంగన్వాడీలలో కూడా బోధించేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సమగ్ర శిక్ష ఏఎంఓ వేణుగోపాల్, సత్యసాయి జిల్లా సమగ్ర శిక్ష ఏ ఎంఓ కె.చంద్రశేఖర్, కెఆర్‌పిలు, డిఆర్‌పి పాల్గొన్నారు.

కలంపై జులుం..!

- దాడికి నిరసనగా జర్నలిస్టుల ర్యాలీ
- డీఐజీ, డీఎస్పీకి ఫిర్యాదు

డి.ఎస్.పి కి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు జర్నలిస్ట్

అనంతపురం క్రైమ్ మే 2 ప్రభాతవార్త

కలంపై జులుం సాగింది. జర్నలిస్టులు కదం తొక్కారు. దాడిని నిరసిస్తూ ర్యాలీలు నిరసన తెలిపారు. దీంతో శనివారం సాయంత్రం అనంతపురం నగరం అంతా హోరెత్తింది. వివరాల మేరకు..

ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అనంతపురంలోని శ్రీ గీతం జూనియర్ కళాశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై గత రెండు రోజులుగా వార్తా కథనాలు వ్రాశాడు. దీనిని జీర్ణించుకోలేని యాజమాన్యం వారి గుండాలతో శనివారం అనంతపురంలోని లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా దాడి చేశారు. అంతటితో ఆగకుండా బెదిరించి కాళ్లు మొక్కించుకున్నారని బాధితులు వాపోయారు. దీంతో వివాదాస్పనంగా మారింది. ఒక దళిత విలేకరిని చేతగాని వాడని చేసి ఇలా హింసించి కొట్టడం చాలా బాధాకరమని జర్నలిస్టులు మండిపడ్డారు. ఇందుకు నిరసిస్తూ టవర్ క్లాక్ కోడలి నందు ర్యాలీ బహిరంగ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ నుంచి నేరుగా ర్యాలీగా వెళ్లి డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ భైఠాయించి నినాదాలు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం డిఐజి కార్యాలయానికి వెళ్లి జరిగిన ఉదంతంపై ఫిర్యాదు చేశారు.

కమ్యూనిటీ అనిమల్ హాస్టల్‌ను సందర్శించిన పశుసంవర్ధక శాఖ జేడీ

అనిమల్ షెడ్యూల్ పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

శింగనమల మే 2 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని దుర్గా ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర నిర్మిస్తున్న కమ్యూనిటీ అనిమల్ హాస్టల్ ను శని వారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రేమ చంద్ సందర్శించారు. ఈ సందర్భంగ సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్యశాల సింగనమల డాక్టర్ జి పద్మనాభం 28 పశువులకు సరిపోయేట ట్టుగా, షెడ్డు నిర్మాణం , బెడ్డింగ్, పశువులకు నీటి తొట్టెల నిర్మాణం పూర్తి అయిందని, ఇంక వైరింగ్, పెయింటింగ్, పశువుల బోను, గడ్డి కత్తి రించు యంత్రము ఇలాంటివి మాత్రమే పెండింగ్ ఉన్నాయని, ఇవి కూడా తొందరలో పూర్తి చేయబడతాయని ఇంజనీరు వారికి తెలియజేసారని జెడికి తెలియజేశారు. వివరాలు తెలుసుకున్న అనంతరం జేడీ సలకంచెరువు పశువైద్యశాలను ఆకస్మికముగా తనిఖీ చేశారు అనంతరం అక్కడి రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నదని, డాక్టర్ల కొరత ఉన్నందువలన, తదుపరి ప్రభుత్వం పోస్ట్ ఫిల్ చేసేంతవరకు ఇన్చార్జ్ డాక్టర్ గా తరిమల పశువైద్యాధికారి డాక్టర్ మోనప్రియ గారిని నియమించామని, అత్యవసర కేసులను ఆమె దృష్టికి తీసుకువెళ్లాలని, వీలును బట్టి వారానికి ఒకటి లేదా రెండు రోజులు హాజరవుతారని, ఇక్కడ రెగ్యులర్ గా పని చేయడానికి శ్రీ జి చంద్రశేఖర్ వెటర్నరీ అసిస్టెంట్ ను నియమించామని వారు రోజూ హాజరవుతారని , రైతులకు తెలిపారు.ఆసుపత్రి పని వేళల్లో పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సలకం చెరువు స్టాఫ్ ను , వివిధ గ్రామాలలో పనిచేస్తున్న అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్స్ ను, గోపాల మిత్రులను ఆదేశించడం జరిగినది.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రేమచంద్

అగ్నికి ఆహుతి అయిన గడ్డివాములు

సంఘటన స్థలాన్ని పరిశీలించిన బొమ్మన శ్రీరామ్ రెడ్డి

అగ్నికి ఆహుతి అవుతున్న గడ్డివాములు

శింగనమల మే 2 ప్రభాతవార్త

మండల పరిధిలోని పోతురాజు కాలువ గ్రామానికి చెందిన రైతులు చింతకాయల నాగన్న, ఎస్. నాగరాజు తమ 20 ఎకరాల పొలంలోని నిల్వ ఉంచిన రెండు గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా కాలిపోయి బొగ్గు పాలయ్యాయి. ఈ ఘటనతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.పశువులకు అవసరమైన ఆహారం పూర్తిగా నష్టపోవడంతో పాటు ఆర్థికంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న వైకాపా రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ బొమ్మన శ్రీరామిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత రైతులు చింతకాయల నాగన్న మరియు ఎస్. నాగరాజును పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత రైతులకు వైకాపాఅండగా నిలుస్తుందని, అవసరమైన అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు అధికారులకు తెలిపారు.

అగ్నికి ఆహుతి అయిన గడ్డివాములను పరిశీలిస్తున్న బొమ్మన శ్రీరామ్ రెడ్డి

జిల్లాకు మహాధన్ కంపెనీకి చెందిన

1208 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు

ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట కుమార్

స్టాక్ రిజిస్టర్ను పరిశీలిస్తున్న వెంకట్ కుమార్

అనంతపురం రూరల్, మే 02 ప్రభాతవార్త

జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా ప్రసన్నాయపల్లి రాకే పాయింట్ కు మహాధన్ కంపెనీకి సంబంధించిన 2599 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు రావడంతో ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు, అనంతపురం ఏ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాకు కేటాయించిన 1208 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులలో 206 మెట్రిక్ టన్నులు 24-24-0, 944 మెట్రిక్ టన్నుల 20-20-013 మరియు58 మెట్రిక్ టన్నుల 9-24-24-2.1-0.3-06 ఎరువులు జిల్లా లో గల వివిధ ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయడం జరిగిందని ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట కుమార్ తెలిపారు. మిగిలిన 1391 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి,కడప మరియు నంద్యాల జిల్లాలకు కేటాయించడంజరిగిందన్నారు. ఈ పరిశీలన లో రాప్తాడు మండల వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.

కల్లూరు ఆర్ఎస్‌లో రహదారిపైకి అక్రమ కట్టడాలు

కల్లూరు ఆర్ఎస్‌లో ప్రధాన రహదారిపైకి విస్తరించిన అక్రమ కట్టడాలు

గార్లదిన్నె,మే 02,ప్రభాతవార్త

మండలంలోని కల్లూరు ఆర్ఎస్‌లో అనంతపురం-గుత్తి ప్రధాన రహదారిపై మదిహా లేడీస్ కార్నర్ ఫ్లవర్ స్టాల్ యజమానులు అక్రమంగా గోడ నిర్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపైకి విస్తరించిన ఈ నిర్మాణం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు మరింత సమస్యలు సృష్టిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ గోడను తొలగించాలని కోరుతున్నారు.

10లో సత్తా చాటిన విద్యార్థిని దివ్యశ్రీ

అనంతపురం సిటీ, మే 2 ప్రభాతవార్త

ప్రతిభ కనబర్చిన విద్యార్థిని దివ్యశ్రీ

ప్రభుత్వ పాఠశాలలో చదివి మండలంలో మొదటి ర్యాంకర్‌గా నిలిచి విద్యార్థిని దివ్యశ్రీ సత్తా చాటింది. రూరల్ మండల పరిధిలోని తపోవన్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని దివ్యశ్రీ 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా జయప్రకాష్ యాదవ్ 575 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, అలేఖ్య 571 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ పేర్కొన్నారు. అదే విధంగా తపోవన్‌నగర్ పాఠశాలలో 18 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు మండలంలో మెరుగైన ఫలితాలను సాధించడం పట్ల పలువురు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

సీఎం చంద్రబాబును కలిసిన టిడిపి నేత బండారు రామాంజనేయులు

శింగనమల మే 2 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడుతో బండారు రామాంజనేయులు

టీడీపీ సీనియర్ నాయకుడు బండారు రామాంజనేయులు తన జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రామాంజ నేయులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బండారు రామాంజ నేయులుకి పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను, ప్రజాసేవలో చూపుతున్న కృషిని అభినందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశీస్సులు తనకు మరింత ప్రేరణనిచ్చాయని పేర్కొన్నారు.

శాప్ ఆధ్వర్యంలో 65 కేంద్రాలలో వేసవి శిక్షణశిభిరాలు ప్రారంభం

- డిఎస్‌డిఓ మంజుల

అనంతపురం సిటీ, మే 2 ప్రభాతవార్త

రాష్ట్రక్రీడాభివృద్ధిసంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 65 కేంద్రాలలో వేసవి క్రీడా శిక్షణ శిభిరాలు ప్రారంభించినట్లుజిల్లా క్రీడా అభివృద్ధి అధికారిని మంజుళ పేర్కొన్నారు. మే1 నుంచి మే 31 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. అత్యధికంగా వాలీబాల్ 12, బాస్కెట్‌బాల్ 6, కబడ్డీ 6 శిక్షణ కేంద్రాలలో ఆరు ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా క్రీడా కారుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిభిరాల్లనలు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ శిక్షణ కేంద్రాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులను నియమించడం జరిగిందని ఆమె తెలిపారు.

04ATP13_04ATP13.qxd 02-05-2026 PM 11:28 Page 1

రైతన్నల పక్షపాతి కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నల్లచెరువు మే 2 ప్రభాతవార్త

రైతన్నల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తవలమర్రి గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన మన భూమి మన హక్కు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ విచ్చేశారు. తహసిల్దార్ రవినాయక్ ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛము అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. రైతన్నలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో రైతన్నల ఆస్తులకు చెందిన పట్టాదారు పాసు పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫోటోలను ముద్రించి భూములను కాజేయాలని దురుద్దేశంతో ఉండేవారని. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీ ఆస్తి మీ సొంతం అనే ఒక మార్పుకు నాంది పలుకుతూ ఇచ్చిన మాట మేరకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్న ఘనత ప్రస్తుత కూటమి ప్రభుత్వానిదని. రైతన్నలకు అండగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అందిచారని. కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువల ద్వారా రైతులకు అందించి వ్యవసాయ పండుగకు అండగా నిలబడ్డారని. రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీలో రైతన్నలకు కావాల్సిన ఎరువులను అందిస్తున్నారని. పలు సమస్యలపై కార్యాలయాలకు విచ్చేసి ప్రజల పట్ల సమన్వయంతో సమస్య పరిష్కారానికి తగిన కృషి చేయాలని. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం. అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని. ప్రజలు మోసపూరితమైన పాలనకు విసుగుచెంది అభివృద్ధికి పట్టం కట్టారని. అనేక సంక్షేమ



రైతులకు పట్టాదార పాసు బుక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పథకాల అమలు ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు. ఆర్డీవో వివిఎస్ శర్మ. ఆర్ ఏ లక్ష్మీదేవి, ఏవో లక్ష్మీ ప్రియ, ఆర్డబ్ల్యూఎస్ జయమ్మ, మహిళ అధ్యక్షుల రాలు పర్వీన్ భాను సహకార సంఘం అధ్యక్షులు కుండ వెంకటరమణ మాజీ ఎంపీపీ మాబు సాబ్ ఆమార్కెట్ వైస్ చైర్మన్ అశ్వత్థ నాయుడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జక్కా లక్ష్మీనారాయణ . మాజీ సర్పంచ్ హర్షవర్ధనాయుడు.. కూటమి నాయకులు జెరిపిటి శంకర, హరిబాబు. నరసింహులు,మండల అధికారులు. స్థానిక నాయకులు. అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంపురం చెరువు ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

జలధార జలహారతి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ , కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పెనుకొండ, మే 02 ప్రభాతవార్తా

మండల పరిధిలోని రాంపురం గ్రామపంచాయతీ లో ఖిజలధార జల హారతిఖి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు.మరవపల్లి చెరువు నుండి చెర్లోపల్లి చెరువు వరకు జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. మొత్తం 4,000 మీటర్ల పొడవునా రూ.19.81లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయి.ప్రస్తుతం పనుల్లో ఉన్న 262 మంది కూలీలతో కలెక్టర్ మాట్లాడారు. రోజుకు రూ.307 చొప్పున వేతనం అందుతోందని, సకాలంలో బిల్లులు జమ అవుతున్నాయని కూలీలు ఈ సందర్భంగా తెలియజేశారు.పనుల నాణ్యతపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.మేట్ మోనికను, ఉపాధి హామీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.100 రోజుల ప్రణాళికలో భాగంగా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, తహశీల్దార్ స్వాతి, ఏపీవో సంజీవరెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఈశ్వరయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ , ఇంజనీరింగ్ అసిస్టెంట్ విశ్వనాథరెడ్డి, ఇరిగేషన్ ఏ ఈ లక్ష్మీనారాయణ, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు,ఫీల్డ్ అసిస్టెంట్లు నారాయణ,నగేష్ నీటి పారుదల శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసమే హిజ్రా మల్లికను హత్య చేశారు

- ఏఎస్పి రోహిత్‌కుమార్‌చౌదరి

హత్య చేసిన వారిని కడప మహిళల ప్రత్యేక జైలుకు తరలించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్, మే 2 ప్రభాతవార్త

గత నెల 27వ తేదీన హత్యకు గురైన మల్లిక అనే హిజ్రాను తోటి హిజ్రాలు ఆధిపత్యం కోసమే హత్య చేశారని ఏఎస్పి రోహిత్‌కుమార్‌చౌదరి పేర్కొన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాసపురంలో నివసిస్తున్న మల్లిక అనే హిజ్రాను ఈనెల 27వ తేదీ ఇంటి వద్ద నుంచి శిరీష అనే హిజ్రాతో పాటు మరో పదిమంది బలవంతంగా ఆటోలో ఎత్తుకెళ్లి కిడ్నాప్ చేసి చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ సమీపం వద్దకు తీసుకువెళ్లి హత్య చేసి రైల్వే ట్రాక్‌పై పడవేశారన్నారు. మొదట మిస్సింగ్ కేసుగా నమోదు చేసి అనంతరం రైల్వే పోలీసులు బదిలీ చేసిన కేసును హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. మల్లికకు శిరీషకు ఉన్న ఆధిపత్యం కారణంగా గతంలో ఇరువర్గాలు ఘర్షణపడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం జరిగిందన్నారు. వారు భిక్షాటన చేస్తున్న డబ్బుల విషయంలో తీవ్ర మనస్పర్థలు నెలకొన్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మల్లికను శిరీష, రాధా, సంగీత, అస్మిత, దివ్య, నవ్య, వర్ష, కరీనా, మహీ, లక్ష్మీ, తనుశ్రీలు కలిసి హత్య చేశారన్నారు. వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరుచగా కడప మహిళల ప్రత్యేక జైలుకు తరలించినట్లు ఏఎస్పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఆరోహణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊళ్లు...అడుగుతున్నాయి నీళ్లు..!

కోనుప్పలపాడులో పండ్లతోటల రైతులకు తప్పని ట్యాంకు నీటి తిప్పలు, కోనలో నీటిని తరలిస్తూ.. చెట్లను బతికిస్తూ..అన్నదాతల అవస్థలు

మొదటిపేజీ తరవాయి... కన్నీటి పర్యంతమవుతున్నారు. కోనుప్పలపాడులో నిమ్మ, కేశవరాయునిపేటలో మునగ, చింతలాయపల్లిలో నిమ్మ, చీనీ పంటలకు విధి లేని పరిస్థితిలో ట్యాంకు నీటి సాగును ఆశ్రయించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్నదాతలు ట్యాంకర్ల నీటికి ప్రతి తడికి సుమారు రూ. 8 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. కోన సమీపంలోని సున్నపు కోన చెరువు, యాడికి పంచాయతీ బోరుబావి, మరోచోట పుష్కలంగా నీరున్న రైతుల బోరుబావుల నుంచి సాగునీరు తెచ్చుకొని పంటలను కాపాడుకుంటున్నామని, ఇలా ఎన్ని రోజులు కష్టపడాలో అర్థం కావడం లేదని రైతులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు.

:తాగునీటి కష్టాలు తక్కువేమీ కాదు..!

యాడికిలోని వెంగమనాయుడు కాలనీ, రాఘవేంద్ర కాలనీ, జగనన్న కాలనీ, నారాయణస్వామి కాలనీలతో పాటు కమలపాడు, చింతలాయపల్లి గ్రామాల్లో రెండు రోజులకు ఒకసారి తాగునీరు అందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పిన్నేపల్లిలో ఎస్సీ కాలనీ మినహా ఇతర ప్రాంతాల్లోని జనం సమీప ప్రాంతాల్లోని పంటపొలాల్లోకి పరుగులుతీయాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. లక్షంపల్లిలో ఓదాతఇస్తున్న బోరు బావి నీరే పెద్దదిక్కుగా మారిందని, అతను పంటసాగు చేస్తే తాగునీటికి కటకటలాడాల్సిందేనని గ్రామస్థులు చెబుతున్నారు. వీరన్నపల్లిలో తరచూ ప్యానెల్ బోర్డు మరమ్మతులకు గురవుతుండటంతో ఆ గ్రామ మహిళలు తోపుడుబండ్లతో గ్రామసమీపంలోని బోరుబావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. చింతలాయపల్లిలో ఒక కాలనీకి ఒక రోజు మరో కాలనీకి మరో రోజు లెక్కన తాగునీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

:ప్రత్యామ్నాయ మార్గాలు చూపండి..!

వ్యవసాయ బోరుబావులు ఎండిపోతున్న ప్రస్తుత తరుణంలో ఏళ్ల తరబడి కాపాడుకుంటూ వస్తున్న దీర్ఘకాలిక పండ్ల తోటలు ఎండి పోతే తమ పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజులు వర్షాలు పడకపోతే..సమీపప్రాంతాల్లోని కుంటలు, చెరువుల్లో నీరు కూడా అడుగంటి పోతే ఈ మండే ఎండలకు పండ్ల చెట్లను ఎలా కాపాడుకోవాలో దిక్కు తోచడం లేదని నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. తాగు, సాగునీటి అవసరాలు తీరేందుకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని గ్రామీణ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి సవిత

రూ.3 కోట్లతో బీటీ రోడ్లు ప్రారంభం

నూతన రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి

పరిగి మే 2 (ప్రభాత వార్త):

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, పరిగి మండలంలో రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన బీటీ రోడ్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత , జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత శనివారం ప్రారంభించారు. అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్ళు: మంత్రి సవి తఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తోంది. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు. ఈ రెండు రంగాలను సమానంగా అభివృద్ధి చేయడం ద్వారానే రాష్ట్రం సమగ్రంగా ఎదుగుతుంది" అని స్పష్టం చేశారు.ప్రారంభించిన రోడ్లు ఇవే: 1. బీజీగానిపల్లి గ్రామంలో రూ.1.9 కోట్లు 2. పరిగి హైవే నుంచి తిరుమలదేవరపల్లి రూ.1 కోటి 3. ఫ్రైడేటి రోడ్ నుండి విట్టపల్లి రూ.26 లక్షలుదశాబ్దాలుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు రహదారినిర్మాణంతో తమ సమస్యలు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభమవుతుందని స్థానికులు తెలిపారు.పరిగి మండలంలో రూ.45 కోట్ల అభివృద్ధి పనులు పరిగి మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా సుమారు రూ.45 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. రూ.3 కోట్లతో బీసీ హాస్టల్ నిర్మాణం జరుగుతోందని, త్వరలో మరో రూ.3 కోట్ల నిధులతో ఎస్సి హాస్టల్ పనులు ప్రారంభిస్తామన్నారు. ఊటుకూరులో రూ.2 కోట్లతో పీహెచ్ సి భవన నిర్మాణం జరుగుతోందని చెప్పారు.వైసీపీపై మంత్రి ఫైర్ రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసినా కూడా వైసీపీ నాయకులు కావాలని విమర్శలు చేయడం దురదృష్టకరమని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారు. కళ్ళుండి మూడలేని కబోదుల్లా వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారు. తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి అసత్య ఆరోపణలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు" అని విమర్శించారు.కియా వంటి ప్రముఖ కంపెనీల రాకతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగేలా మరిన్ని పరిశ్రమలను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, ఏపీ లైవ్ స్టాక్ డైరెక్టర్ వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు,ఎస్ ఎన్ కార్తీక్ రెడ్డి,మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

40వ ప్రజా దర్బార్ లో అర్జీల స్వీకరణ

ప్రజల నుండి విన్నితులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుబాటి

అనంతపురం క్రైమ్ మే 2 ప్రభాతవార్త

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతల వారీగా పరిష్కారమయ్యేల చర్యలు తీసుకుంటామని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయం నందు 40వ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి అర్జీలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్దిదారులతో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, మే 2 ప్రభాతవార్త

అనారోగ్యంతో బాధపడుతూ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతులు మీదుగా స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్దిదారులకు రూ.17,48,986 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 24 నెలల కాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా 527 మంది లబ్దిదారులకు రూ.4,56,82038 చెక్కులను అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఇంత పెద్ద ఎత్తున కదిరి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కదిరి నియోజకవర్గ ప్రజల తరుపున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కమిషనర్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌భాను, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, జనసేనపార్టీ నాయకులు పాల్గొన్నారు.

యాడికి మండలంలో మండుతున్న ఎండలు..ఎండుతున్న పంటలు

అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సవిత

అన్న క్యాంటీన్ తనిఖీ చేస్తున్న మంత్రి, క్యాంటీన్ లో భోజనంచేసి నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి.

పెనుకొండ మే 2 ప్రభాతవార్త

పెనుకొండలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్యాంటీన్‌ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత,జౌళి శాఖా మంత్రి సవిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత క్యాంటీన్‌లోనే భోజనం చేసి, అక్కడ భోజనం చేస్తున్న ప్రజలతో ముచ్చటించారు. భోజనం రుచి, నాణ్యత గురించి అడిగి తెలుసుకోగా, ప్రజలుఎంతో సంతోషం వ్యక్తంచేశారు. కేవలం 5 రూపాయలకే కడుపునిండా మంచిభోజనం అందుతున్నందుకు ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రిసవిత మాట్లాడుతూ,పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువధరలో నాణ్యమైనఆహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అన్నక్యాంటీన్లు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజల సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించాను. ఈ కార్యక్రమంలో జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు అస్వర్థనారాయణ, టిడిపి నాయకులు కురుబవాండ్లపల్లి సోమశేఖర్, రామాంజనేయులు, మావుటూరు గోపాల్, చంద్రకాంతమ్మనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే దగ్గుపాటి

ఇద్దరు బాధితులకు రూ.3.71లక్షల సాయం

అనంతపురం క్రైమ్ మే 2 ప్రభాతవార్త

అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా ఇబ్బందుల్లో వారి పాలిట అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆపద్బాంధవుడు అయ్యారు. వివిధఆసుపత్రుల్లో ఆపరేషన్లకు అవసరమైన డబ్బును ఎల్.ఓ.సీద్వారా అందజేశారు. అర్బన్‌నియోజకవర్గానికి చెందిన బిటిడిపి నాయకుడు మంజునాథ్‌నగరంలోని ప్రభాకర్‌వీధిలో ఉంటారు. మంజునాథ్ తల్లి అంబారపుసరస్వతి అనారోగ్య పరిస్థితులతో ఇబ్బంది పడుతుండగా ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యం కోసం కొంత డబ్బు ఖర్చవుతుందని చెప్పారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే.. ఆయన వెంటనే స్పందించి రెండు రోజుల్లోనే రూ.71వేలను ఎల్ఓసీ ద్వారా తెప్పించారు. ఈ పత్రాన్ని సరస్వతి కుమారుడు, ఐ టిడిపి నాయకుడు మంజుకు ఎమ్మెల్యే దగ్గుపాటి తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యేకి సరస్వతి కుటుంబసభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇటు నారాయణపురం గ్రామానికి చెందిన గుడికల్ నగేష్ కు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆపరేషన్ కు చాలా ఖర్చవుతుందని వైద్యులు కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో వారు స్థానిక టీడీపీ నాయకుడు, క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజుకు విషయాన్ని చెప్పారు.



బాధితులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుబాటి

వారు ఎమ్మెల్యే దగ్గుపాటి వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించారు. ఆయన వెంటనే స్పందించి రూ.3లక్షలు ఎల్ఓసీ ద్వారా తెప్పించారు. ఈ ఎల్ఓసీ పత్రాన్ని నగేష్ కుటుంబసభ్యులకు టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు, టిడిపి నాయకులు బాలా, రామలింగం తదితర నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే చేసిన సాయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ఆదివారం జరిగే నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు చర్యలు - జిల్లా ఎస్పీ

- జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు.. హాజరుకానున్న 3,616 మంది అభ్యర్థులు

- ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్ష

అనంతపురం, మే 2 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లాలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, న్యూఢిల్లీ వారు ఈనెల 03వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కంఎంట్రెన్స్ టెస్ట్ ఫర్‌అండర్ గ్రాడ్యుయేషన్ (యుజి) పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలుచేపట్టామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటలవరకు నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 08పరీక్షాకేంద్రాలలో నిర్వహించబడుతుందని, ఇందులో అనంతపురములో 6, గుత్తిలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షకు 3,616 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశించిన సమయంలోపు హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మధ్యాహ్నం 01:30 గంటల లోపు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు ఈఅడ్మిట్ కార్డ్ తో పాటు ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏదో ఒక గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు అవ్వాలన్నారు. ఈ పరీక్షకి మొబైల్ ఫోన్లు/ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు/బ్లూ టూత్/ఏదైనా ఇతర కమ్యూనికేషన్ పరికరాలు పరీక్ష కేంద్రములోనికి అనుమతించబడవన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ కెమేరాలు వినియోగిస్తున్నామన్నారు.

పాత కక్షలతోనే అబ్దుల్‌ను హత్య చేశారు

- ఏఎస్పి రోహిత్‌కుమార్‌చౌదరి

నిందితులను చూపుతున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, మే 2 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ఓంశాంతినగర్‌లోని నాగులకట్ట వద్ద గత నెల 27న అబ్దుల్‌బాషా అనే వ్యక్తిని పాత కక్షలతోనే అతని స్నేహితులు హత్య చేశారని ఏఎస్పి రోహిత్‌కుమార్‌చౌదరి పేర్కొన్నారు. పట్టణంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌బాషాను అతని స్నేహితులు మహమ్మద్‌గౌస్, శివ కార్తీక్, చాకలి వెంకటేశు, మిద్దె నాగేంద్రలు కలిసి పాత కక్షల కారణంగా కత్తులతో పొడిచి, బండరాళ్లతో కొట్టి హత్య చేసి పరారయ్యారన్నారు. వారిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులు ఉపయోగించిన మోటార్‌సైకిల్, కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పి తెలియజేశారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ ఆరోహణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

షేర్ మార్కెట్‌లో నష్టాలపాలై..అప్పులు తీర్చడానికి దొంగగా మారిన విద్యుత్‌శాఖ ఉద్యోగి

- వివరాలను వెల్లడించిన డిఎస్పీ శివనారాయణస్వామి

మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ శివనారాయణస్వామి

కదిరి, మే 2 ప్రభాతవార్త

అప్పులు తీర్చడానికి ఓ ప్రభుత్వ ఉద్యోగి దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుపబడిన సంఘటన కదిరి పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం పట్టణపోలీసు స్టేషన్‌లో అందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ శివనారాయణస్వామి వెల్లడించారు. డిఎస్పీ తెలిపిన వివరాల మేరకు డి.రమేష్‌నాయక్ స్థానిక ఎపిఎస్‌పిడిసిఎల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అత్యాశకు పోయి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. షేర్ మార్కెట్‌లో చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనాలకు పాల్పడి అప్పులు తీర్చడానికి లక్ష్యంగా చేసుకున్నాడన్నారు. ఇటీవల మగ్గాల కోట్రస్‌లో నివాసం ఉంటూ ఇండ్లల్లో పాచిపని చేసి జీవనం సాగించే పైపల్లి శాంతి ఈ నెల 28న తన పనులను ముగించుకుని ఇంటికి వెళ్తుండగా స్కూటీపై వెనకనుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రూ.2లక్షలు విలువైన బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కుని పారిపోయారన్నారు. ఈ విషయంపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో డిఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సిసి కెమెరాల సహాయంతో చైన్‌స్నాచర్ రమేష్‌నాయక్‌గా గుర్తించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అరెస్టు చేసినట్లు డిఎస్పీ తెలిపారు. అరెస్టు చేసిన నిందితుని నుంచి రూ.2లక్షలు విలువైన రెండు తులాల బంగారు తాళిబొట్టు గొలుసు,నేరానికి ఉపయోగించిన ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. చైన్ స్నాచర్‌లో చైన్‌స్నాచర్‌కేసును త్వరితగతిన ఛేదించి ముద్దాయిని త్వరితగతినఅరెస్టు చేసిన సిఐ డివి నారాయణరెడ్డిని,ఎస్ఐ బాబ్‌జాన్, సిబ్బంది దేవా, హుస్సేన్, నాగరాజు, హరినాథ్‌రెడ్డి, పట్టణ సిబ్బంది శివశంకర్‌రెడ్డి, రమణ, రెడ్డెప్పలను అభినందించి వారికిరి వార్తను అందజేశారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.